క్లుప్తంగా

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బోడ రఘు



ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన బోడ రఘును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియమకపత్రం అందించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే సీతక్కకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన యూత్ సభ్యులు పంగ సురేష్, దేవేందర్, కొయ్యల మహేందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్టమధు మంథనిలో గురువారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం మాజీ జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాదారపు స్వామి, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, పెరటి సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

మల్హర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ క్రాస్ వద్ద పోలీసులు గురువారం విస్తృత వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి



కాటారం: ప్రజలు ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకునే దిశగా ముందుకెళ్లాలని కాటారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఐలేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండి బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ ద్వారా అనేక రకాల రుణాలు, పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవై, ఏపీవై లాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వడ్డీ రాయితీ కోసం పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని రైతులకు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఎస్‌హెచ్‌జీ రుణాలను తిరిగి చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్‌తో పాటు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను నియంత్రించాలి

భూపాలపల్లి రూరల్: గుడుంబాను అరికట్టాలని, బెల్టు షాపులను నియంత్రించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గుడుంబా తయారీని ఆపడంలో భాగంగా తయారు కేంద్రాలపై దాడులు నిర్వహించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులను నిర్మూలించాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి, కాటారం స్టేషన్లకు సంబంధించిన ఎక్సైజ్ అధికారులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రశాంతి పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీల’పై ప్రచారం

భూపాలపల్లి రూరల్: ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా గురువారం భూపాలపల్లి పట్టణంలోని 20 వార్డులో పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, 20వ వార్డు కమిటీ అధ్యక్షుడు నోముల నారాయణ, నాయకులు మంతెన సాంబయ్య, నగావత్ ప్రభాకర్, ప్రతాప్, కిష్టయ్య, పిక్కల సారయ్య, షేక్ ఇజాజ్, ఐలవేణి రమేష్, నగునూరి రజినీకాంత్ గౌడ్, మట్టివాడ సురేష్, బాదావత్ దిలీప్, అఖిల్, బీర్ చంద్ పాల్గొన్నారు.

గుడుంబా జోరు..!

- పల్లెల్లో ఏరులై పారుతున్న నాటుసారా
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా ఏరులై పారుతోంది. కొద్ది నెలల నుంచి మండలంలో గుడుంబా తయారీ విక్రయాలను సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కమలాపురం, తిమ్మంపేట, నర్సింహాసాగర్ తదితర గ్రామాల్లో గుడుంబా తయారీని కొందరు కుటిర పరిశ్రమగా ఎంచుకున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వీదికో గుడుంబా బట్టి, రెండు నుంచి నాలుగు వరకు గుడుంబా విక్రయాల షాపులు ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు.

గ్రామాల్లో బహిరంగంగా, తయారీ విక్రయాలు

మల్లూరు, నర్సింహాసాగర్‌లో ప్రభుత్వ కార్యాలయాల పక్కన, ప్రధాన రోడ్ల వెంట గుడుంబా తయారీ కేంద్రాల నిర్వహణ సాగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నిత్యం గుడుంబా తయారీ విక్రయాలు చేస్తుండటంతో గుడుంబా వాసన ఘాటు, బెల్లం పానకం దుర్వాసనతో తీవ్ర



తయారు చేస్తున్న గుడుంబా

ఇబ్బంది పడుతున్నామని ఆయా కేంద్రాల చుట్టు ఉన్న జనావాసాల ప్రజలు వాపోతున్నారు. దినసరి కూలీలు, నిరుపేదలు, యువత తక్కువ ధరకు లభించే గుడుంబాను అతిగా సేవించి అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు బహిరంగంగా సాగుతున్న అరికట్టాల్సిన అబ్కారి అధికారులు మామూళ్ల మత్తులో నెల నెలా ముడుపులు తీసుకుంటూ సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక పోలీసులు అడపా దడపా దాడులు నిర్వహించి తయారీ దారుల నుంచి గుడుంబా స్వాధీనం చేసుకుని వేలాది లీటర్ల బెల్లం పానకం, తయారీ పరికరాలు ధ్వంసం చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ విషయంపై సంబంధిత ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గుడుంబా తయారీ విక్రయాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ వర్తించదా?

మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న గుడుంబా తయారీ, విక్రయాలతో పాటు బెల్టు షాపుల్లో అక్రమ మద్యం విక్రయాలకు ఎన్నికల కోడ్ వర్తించదా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా మండలంలో గుడుంబా తయారీ విక్రయాలతో పాటు బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ విషయంపై ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ ఫకీరాను వివరణ అడిగేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి



విద్యార్థులతో అటవీ శాఖ అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించి కాపాడుకోవాలని ఏటూరునాగారం ఫారెస్ట్ డివిజన్ అధికారి అనుజ్ అగర్వాల్ అన్నారు. 69వ వన్య ప్రాణి సప్తాహ ముగింపు సందర్భంగా గురువారం తాడ్వాయి, పస్రా వైల్డ్ లైఫ్ రేంజ్ ఆధ్వర్యంలో విద్యార్థులను అడవులను సందర్శనలకు తీసుకెళ్లి, అటవీ, వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పస్రా రేంజ్ అధికారి శిరీష, తాడ్వాయి వైల్డ్ లైఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ నాగజ్యోతిని గెలిపించాలి

ఎస్ఎస్ తాడ్వాయి: పేదింటి ఆడబిడ్డ జెడ్పీచైర్‌పర్సన్ నాగజ్యోతిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పిన్నింటి యాదిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇల్లు లేని ఉద్యమకారుడి కుటుంబానికి చెందిన పేదింటి ఆదివాసీ మహిళ బడే నాగజ్యోతిని గుర్తించి సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించారన్నారు. ఆమెను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. అధికారంలో ఉన్న అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. అంతకుముందు సమ్మారావు మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య,



మాట్లాడుతున్న సమ్మారావు

మాజీ జెడ్పీటీసీ రామసాయం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ముంద్రాతి రాజమౌళి, మండల ఉపాధ్యక్షుడు చల్ల రజనీకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, నాయకులు సిద్దబోయిన వసంతరావు, బండారు చంద్రయ్య, లక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘సీపీఎంపై ఆరోపణలు సరికాదు’



మాట్లాడుతున్న వంక రాములు

వాజేడు: సీపీఎం పార్టీపై గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకుడు పూనెం సాయి చేసిన ఆరోపణలు సరికాదని ఆ పార్టీ జిల్లా నాయకుడు వంక రాములు అన్నారు. మండల పరిధిలోని మండపాక వద్ద గుడిసె వాసులకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సీపీఎం పార్టీ ప్రతి నిత్యం ఆదివాసీల కోసం పోరాటం చేస్తుందని వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. పేద గిరిజనులకు పోడు భూముల పట్టాలను ఇప్పించడంలో కాని, ఇంటి స్థలాలు ఇప్పించడంలో కాని సీపీఎం పోరాటం ఉందన్నారు. సీపీఎం పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఎక్కడ ఆక్రమించుకున్నరో నిరూపించాలన్నారు. ఆయన వెంట మండల కార్యదర్శి రఘుపతి, బచ్చలి సౌమ్య, కృష్ణబాబు, రమాదేవి, ప్రవీణ్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(కె): మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తుడుందెబ్బ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం తుడుందెబ్బ పోరాటం చేస్తుందని అన్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన వారు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఆదివాసీ విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువులను మానేస్తున్నారని, వ్యవసాయ



మాట్లాడుతున్న కబ్బాక శ్రావణ్‌కుమార్

పనులకు వెళ్తున్నారని అన్నారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తీసుకురాని నాయకులకు ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, చింత సోమరాజు నాగేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గరిగ లత

ములుగు రూరల్: మండలంలోని బరిగలానిపల్లి ప్రాథమిక పాఠశాలలో దసరా సెలవుల సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి పోషన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ గరిగ లత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నిర్వహించిన ఎస్ఏ 01 పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, సెప్టెంబర్ నెలలో వందశాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోరిక రతన్‌సింగ్, మంద రాజు, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఏటూరునాగారం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ నల్లెల్ల సృజన్ కుమార్‌ను గురువారం వాడబలిజ సేవా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార ఆనంద్, నరసింగరావు, గంగరాజు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

కన్నాయిగూడెం: వాజేడు మండల కేంద్రానికి చెందని రోహిత్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. దీంతో అతడు ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతుండటంతో ముప్పనపల్లి సహాయ నిధి టీమ్ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రూపు సభ్యులు అబ్బు వంశీ, అచ్చ హరీష్, తొంగలి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు అధికార పార్టీ నాయకులు అవినీతి పాల్పడి వారి కార్యకర్తలకే కేటాయించారని వెంటనే విచారణ జరిపి అర్హులకు కేటాయించాలని కోరుతూ.. పట్టణ మహిళలు గురువారం జిల్లా లీగల్ సెల్ (ఉచిత న్యాయ సేవ సంస్థ) సెక్రటరీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తమకు సొంత ఇళ్లు భూములు జాగలులేవని, రోజువారి కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల నుంచి డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని, చెప్పితే దానిమీద ఆశతో బతుకుతున్నామన్నారు. డబల్ బెడ్‌రూంలు నిజాయితీగా పంపిణీ చేస్తారనే ఆశతో ఉంటే ఈనెల 09న ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో పేదలకు ఎలాంటి సమాచారం లేకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకొని అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లను మరోసారి సర్వే చేసి అర్హులకు కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాధవి కొప్పుల రాజమణి, కాల్వ భాగ్యలక్ష్మి, సూరం శ్రీలత, తుమ్మేటి సుష్మిత పాల్గొన్నారు.

నియామకం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కమిటీని గురువారం రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సత్తనపెల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా తోడేటి అశోక్, ఉపాధ్యక్షులుగా కిన్నెర కుమార్, కొడారి దేవేందర్, కోశాధికారిగా పానగంటి జానీ, ప్రచార కార్యదర్శిగా ఎరబాటి శివకృష్ణ, సహాయ కార్యదర్శిగా అమ్ముల పోశాలు, గౌరవ అధ్యక్షుడిగా నామాల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు వెంకటనారాయణ, కుమార్‌యాదవ్, రాజేందర్, లక్ష్మీనారాయణ, బొడ్డుల సంతోష్, బోయిని రాజు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

టేకుమట్ల: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న కిరాణ షాపుపై గురువారం దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ద్వారకపేట గ్రామానికి చెందిన మొమినోద్దీన్ అనే వ్యక్తి అతడి కిరాణంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తురనే సమాచారంతో దాడులు చేయగా రూ.2600 విలువ చేసే మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుడుంబా స్వాధీనం..

మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో మైస రాంచందర్ అనే వ్యక్తి గుడుంబాను విక్రయిస్తుండగా, వెల్లంపల్లి గ్రామానికి చెందిన జాంటు సదయ్య అనే వ్యక్తి గుడుంబాను తరలిస్తుండగా చలివాగు శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు వారి ఇద్దరి నుంచి 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లను అందజేస్తున్న కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక హెల్త్ సబ్‌సెంటర్‌లో గురువారం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లడుతూ.. గర్భిణులు పోషకవిలువలు కలిగిన ఆకుకూరలు తీసుకోవాలని అన్నారు. ఆశవర్కర్లు గ్రామాల్లోకి వచ్చినప్పుడు ఎలాంటి సమస్య ఉన్న తెలియజేయాలని సూచించారు. నీరు ఎక్కువగా తాగటం వల్ల ప్రసవానికి ఇబ్బంది కలుగకుండా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పూజారి ఆదిలక్ష్మి, రాధ, కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, సరిత, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

‘హామీలను విస్మరించిన కేసీఆర్’

ములుగు రూరల్: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని రాంచంద్రాపురంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏకకాలంలో రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ రైతును మోసం చేశారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పార్టీ కార్యకర్తల, నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, గ్రామశాఖ



మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

అధ్యక్షుడు మూల రవీందర్, నల్లెల్ల భరత్, రాజిరెడ్డి, సాంబయ్య, హట్కర్ స్వామి, యాకూబ్ రెడ్డి, ఆవుల రమేష్, దొంతి ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, అమరేందర్‌రెడ్డి, జయరెడ్డి, పందికుంట సర్పంచ్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

ఏటూరునాగారం: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి సుచరిత అన్నారు. గురువారం మండల పరిధిలోని కొయగూడ ఎల్లాపూర్ పంచాయతీలోని లంబాడితండాలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గార రమాదేవి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వైద్యాధికారి జయబాబు, వైద్య సిబ్బంది హేమలత తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాపురం గ్రామ సమీపంలోని బష్వర్‌గుంపు గ్రామంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సివిల్ పోలీసులతో కలిసి ఎస్సై కమ్యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అపరిచిత వ్యక్తులు ఎవరైన వస్తే వారి సమాచారాన్ని పోలీసులుకు అందించాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

రాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. నేటి నుంచి పాఠశాలలకు సెలవులు ఉండటంతో పాఠశాలలో ముందుగానే బతకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగు రంగు పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరామ్, సంతోష్, సూజాత, మౌలాలి, విజయ, ఆంజనేయులు రామ్ కోటి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

టేకుమట్ల: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ అనిత అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. అక్రమంగా నగదు, మద్యం రవాణా చేస్తే వెంటనే సీజ్ చేసి, కేసు నమోదు చేస్తారన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ ఎవరూ నగదును తీసుకువెళ్లరాదని, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు చేపట్టినా, ఎన్నికల నియామవళిని పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడా గుంపులు, గుంపులుగా జనం ఉండరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు భాస్కర్, ఎంపీఓ సురేష్, ఏఎస్సై ఇంతియాజుద్దిన్ ఉన్నారు.